BREAKING EDITION
బ్రేకింగ్ ఎడిషన్

Follow: @ANNTELUGU
మహా పత్రిక
మంగళవారం, హైదరాబాద్ 18-02-2025
WWW.EPAPER.MAHAADAILY.COM
ANN తెలుగు

# కేసీఆర్ హీరో అయితే.. ప్రజలు ఎందుకు ఓడించారు

## ప్రజలతో మమేకమైనవాడే నాయకుడు

### బీఆర్ఎస్ వ్యాఖ్యలకు గుత్తా సుఖేందర్‌రెడ్డి కౌంటర్



**మహా, హైదరాబాద్:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ 4కోట్ల ప్రజల హీరో అని అంటున్నారని, అలా అయితే ఆ ప్రజలే ఎందుకు ఓడించారని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం ఆయన మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు ఇంకా అధికారంలోనే ఉన్నామన్న భ్రమలో ఉన్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందని తరుచూ అనడం.. వారి అవివేకమని, అధికారం కోల్పోయిన బాధలో మాట్లాడుతున్నారని గుత్తా అన్నారు. ప్రజలతో మమేకమైన వాడే నాయకుడు అవుతాడని గుత్తా అన్నారు. కులం, మతం తో సంబంధం ఉండదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కులగణన వందశాతం సరిగ్గా చేసిందని కొనియాడారు. బీసీ కులగణన చేయడం దేశంలోనే మొదటి సారి అని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన సమగ్ర కుటుంబ సర్వేకు అఫీషియల్ రికార్డే లేదన్నారు. అసెంబ్లీలో పెడితే రికార్డులో ఉండేదన్నారు. బీసీ కులగణకు బీజేపీ వ్యతిరేకమని అందరికీ తెలిసిందేని అన్నారు.

# తెలంగాణ రియల్ హీరో రేవంత్‌రెడ్డే

### కేసీఆర్ కానేకాదు.. ఎంపీ మల్లు రవి



**మహా, హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ ఎంపీ మల్లు రవి సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రియల్ హీరో రేవంత్‌రెడ్డే నని, కేసీఆర్ కానేకాదని ఎంపీ అన్నారు. 'నా తండ్రి నాకే కాదు.. మొత్తం తెలంగాణకే హీరో' అని నిన్న కేసీఆర్ పుట్టినరోజు సందర్భంగా కేటీఆర్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. తాజాగా కేటీఆర్ వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి కౌంటర్ ఇచ్చారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణ హీరో అని బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుండటం విడ్డూరంగా ఉందన్నారు. తెలంగాణలో నిజమైన హీరో సీఎం రేవంత్ రెడ్డే అని అన్నారు. కేసీఆర్ తన పదేళ్ల పాలనా కాలంలో చేయలేని అనేక అభివృద్ధి, సంక్షేమ పనులను రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక ఏడాది కాలంలో చేసి చూపించారని అన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కుల గణన చేసి కులాల లెక్కలు తేల్చిన ఘనత రేవంత్ రెడ్డిదే అని తెలిపారు. రాష్ట్రంలో 56 ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ మంజూరు చేసి పనులు ప్రారంభించిన ఘనత కూడా రేవంత్ రెడ్డిదే అన్నారు.

**ఒక్క ఏడాది కాలంలోనే..**

25 ఎకరాల స్థలంలో రూ.200 కోట్లతో ఒక్కొక్క ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సహాయ పడేలా ఒక్కో లబ్ధిదారుడికి రూ.5 లక్షలు ఇస్తున్నారని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, రూ.500 లకే గ్యాస్ సిలిండర్, నిరుద్యోగులకు 55 వేల ఉద్యోగాలు, ఆరోగ్య శ్రీ కింద 10 లక్షలు, ప్రజా భవన్ పెట్టి ప్రజావాణి కింద ప్రజల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఫోర్త్ సిటీ ఏర్పాటు చేయబోతున్నారు. ఇవన్నీ ఏడాది కాలంలోనే రేవంత్ రెడ్డి చేసి చూపించారని అన్నారు. అందుకే తెలంగాణ రియల్ హీరో రేవంత్ రెడ్డి అంటున్నానని చెప్పారు.

# డీప్‌సీక్ తో డేంజర్

## సైబర్ సేఫ్టీ తెలంగాణే లక్ష్యం కావాలి



## నేరం జరగకముందే నిరోధించేలా చర్యలు చేపట్టాలి

## 'షీల్డ్ కాంక్లేవ్' సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి

**మహా, హైదరాబాద్:** తెలంగాణను సైబర్ సేఫ్టీ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రస్తుత కాలంలో నేరాల విధానం చాలా వేగంగా మారుతోందన్నారు. ఒకప్పుడు దేశంలో హత్యలు, దోపిడీలు తీవ్ర నేరాలుగా పరిగణించేవారని చెప్పారు. ఇప్పుడు అత్యంత నేరం సైబర్ క్రైమ్ అని అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో మంగళవారం నుంచి రెండు రోజుల పాటు సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో 'షీల్డ్ కాంక్లేవ్2025' సదస్సు నిర్వహిస్తున్నారు. సైబర్ నేరాల నుంచి ప్రజలను రక్షించే ఆవిష్కరణలపై కాంక్లేవ్ ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా సదస్సుకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సెక్యూరిటీ ఆపరేషన్ సెంటర్, సైబర్ ఫ్యూజన్ సెంటర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. సీఎంతో పాటు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు, సీనియర్ పోలీస్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పోలీస్ అధికారులు నిరంతర కృషితో తెలంగాణలో సైబర్ నేరాలు కట్టడి చేస్తున్నామన్నారు.

**సైబర్ నియంత్రణలో టాప్..**

సైబర్ క్రైమ్‌ను నియంత్రించడంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందని సీఎం తెలిపారు. ఈ విభాగాన్ని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేరం జరిగిన తర్వాత నిందితులను పట్టుకోవడం కన్నా, నేరం జరగకుండానే నిరోధించేలా అడుగులు వేయాలన్నారు. తెలంగాణను సైబర్ సేఫ్టీ రాష్ట్రంగా తీర్చిదిద్దుతామన్నారు. దేశం మొత్తం ఒక తాటిపైకి వచ్చి సైబర్ క్రైమ్‌పై పోరాటం చేయాల్సి అవసరం ఉందని అన్నారు. డీప్‌సీక్ న్యూస్‌తో ప్రమాదం పొంచి ఉందని, తప్పుడు వార్తల విషయంలో సోషల్ మీడియాను కంట్రోల్ చేయాలని అన్నారు. అలాంటి సమాచారం సమాజానికి శ్రేయస్కరం కాదన్నారు. కొంతమంది సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్‌ను ప్రచారం చేస్తున్నారని గుర్తు చేశారు. అలాగే ఆర్థిక నేరాలను నిరోధించాల్సిన అవసరం ఉందన్నారు. సైబర్ క్రైమ్ నియంత్రణలో తెలంగాణను దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుదామన్నారు.

**సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930..**

సమాజంలో వస్తున్న మార్పులు, సవాళ్లను ఎదుర్కోవడానికి అన్ని రకాల ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచన చేశారు సీఎం. సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 నిరంతరం అందుబాటులో ఉంటుందన్నారు. సైబర్ క్రైం పట్ల జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో 14 రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. సైబర్ నేరాల నిరోధానికి దేశం మొత్తం యూనిట్‌గా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా అధికారులను సీఎం రేవంత్ అభినందించారు.

## రోబోతో సీఎం షేక్ హ్యాండ్



కాంక్లేవ్‌లో ఏర్పాటు చేసిన రోబోతో సీఎం రేవంత్ రెడ్డి ముచ్చటించారు. ఈ సందర్భంగా రోబోకు సీఎం రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు షేక్‌హ్యాండ్ ఇచ్చారు. అధికారులతో రోబో వివరాలను అడిగి తెలుసుకున్నారు.

# రూ.100కే బీర్..

## ప్రజావాణిలో డిమాండ్



**మహా:** రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కొత్త నినాదం వినిపిస్తున్నారు బీరు ప్రియులు. తమ డిమాండ్స్ నెరవేర్చడంలో ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఈ మేరకు ఏకంగా ప్రజావాణిలో తమ వినతిని ఇచ్చారు. ఇటీవల తెలంగాణలో బీర్ల ధరలు కాస్త పెరిగాయి. కింగ్ ఫిషర్ బీర్ల కంపెనీ కూడా ధరలు పెంచడం లేదంటూ కొద్దిరోజులు రాష్ట్రానికి సరఫరా ఆపేసింది. చిట్టచివరకు ప్రభుత్వం జోక్యంతో కింగ్ ఫిషర్ బీర్ల సరఫరా పునరుద్ధరించారు. దీనితో బీరు ప్రియులు హమ్మయ్య అంటూ ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవల ప్రజావాణిలో పలువురు ఓ అర్జీ సమర్పించారు. ఆ అర్జీ స్వీకరించిన అధికారులు.. అవాక్కయ్యారు. ఔను అందులో ఏముందంటే.. రానున్న వేసవి కాలపు ఎండలను దృష్టిలో ఉంచుకొని. కేవలం రూ. 100 లకే బీర్లు అందించాలన్న డిమాండ్ అది. ఎన్నికలు ఏవైనా గెలిచేది ఎవరనేది తామే నిర్ణయిస్తామని, తమ డిమాండ్ నెరవేర్చకపోతే చాలా వరకు వెళ్తామంటూ హెచ్చరించారు. సాధ్యమైనంత త్వరగా డిమాండ్ నెరవేర్చాలని, లేకుంటే సంఘం పెట్టడం ఖాయమని కూడా అర్జీలో వివరించారు. అంతేకాదు ప్రభుత్వం తీసుకొచ్చే పథకాల్లో మెగావాటా మాదే అంటూ బీరు ప్రియులు ప్రకటించుకున్నారు. అధికారులు మాత్రం అర్జీని స్వీకరించారు.

# రేవంత్ ప్రతీ నిర్ణయం బూమ్ రాంగ్

### బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



**మహా, ఖమ్మం:** బీజేపీ ఎంపీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఖమ్మంలో మంగళవారం ఆయన బీజేపీ అభ్యర్థి సరోత్తంరెడ్డి తరపున ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ ప్రతి నిర్ణయం భూం రాంగ్ అవుతోందని విమర్శించారు. సీఎం రేవంత్ రెడ్డికి కులగణన... బీసీ రిజర్వేషన్లపై నిజాయితీ లేదని.. మోసం చేసి లెక్కలు ప్రకటించారని అన్నారు. ప్రభుత్వం అంటే డ్రామా కంపెనీ కాదని, రిజర్వేషన్లు, కులగణనపై మాట ఇస్తే తప్పవద్దని రేవంత్ కు హితవు పలికారు. ప్రధాని మోదీ మాట ఇస్తే అమలు చేస్తారన్న విశ్వాసం ప్రజల్లో ఉందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉపాధ్యాయులు బీజేపీకి మద్దతు పలుకుతున్నారని తెలిపారు. రేవంత్ రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పీఆర్సీ ఏమైంది... డీఏలు ఏమయ్యాయని నిలదీశారు. సీపీఎస్ విధానంపై ఎటువంటి నిర్ణయం తీసుకున్నారని అడిగారు. గతంలో యూటీఎఫ్ అభ్యర్థిని గెలిపిస్తే ఒరిగింది ఏమీ లేదని విమర్శించారు. బీజేపీ పాలనలో దేశం సుభిక్షమని.. అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పరుగులు పెడుతోందన్నారు. ఉపాధ్యాయలకు అండగా ఉంటామని.. సమస్యల పరిష్కారానికి కొట్లాడతామని స్పష్టం చేశారు.

# వంశీపై కక్షతోనే బాబు కుట్ర

## ఏ తప్పూ చేయలేదు.. కావాలనే జైలులో పెట్టారు

- వచ్చేది మా ప్రభుత్వమే.. ఎవరినీ వదిలిపెట్టం
- వైస్సార్‌సీపీ అధినేత, వైఎస్ జగన్ వార్నింగ్
- జైలులో వల్లభనేని వంశీతో ములాఖత్



**మహా, విజయవాడ:** వైస్సార్‌సీపీ అధినేత, ఏపీ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. 'రేపు మేమూ అధికారంలోకి వస్తాం.. టీడీపీ నేతలతో మిలాఖత్ అయిన అధికారులను, అటువంటి నాయకులను మేం వదిలిపెట్టం' అంటూ జగన్ సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం జైలులో ఉన్న వైఎస్సార్‌సీపీ నేత వల్లభనేని వంశీతో ములాఖత్ అయ్యారు. కిడ్నాప్ కేసులో అరెస్టయిన వల్లభనేని వంశీ విజయవాడ జిల్లా సబ్ జైలులో రిమాండ్ లో ఉన్న విషయం విదితమే. జరిగిన పరిణామాలన్నీ వంశీని అడిగి తెలుసుకున్నారు. జగన్ వెంట వంశీ సతీమణి పంకజశ్రీ లోపలికి వెళ్లారు. ఈ సందర్భంగా జైలు వద్ద పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. జగన్ వెంట కొడాలి నాని, పేర్ని నానితోపాటు పలువురు వైసీపీ నేతలు ఉన్నారు. జైలులో వంశీతో ములాఖత్ అనంతరం జగన్ మోహన్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. వల్లభనేని వంశీ అరెస్ట్.. ఏపీలో దిగజారిపోయిన లా అండ్ ఆర్డరుకు అద్దం పడుతోందని అన్నారు. ఇదంతా వంశీపై కక్షతో చంద్రబాబు చేస్తున్న కుట్ర అని మండిపడ్డారాయన. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని, వంశీని అరెస్ట్ చేసిన తీరు దారుణం అని వైఎస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి జరిగిందని ఫిర్యాదు చేసిన సత్యవర్ధన్ కేసును ఉపసంహరించుకున్నారన్నారు. వంశీ తప్పు చేయలేదని సత్యవర్ధన్ చెప్పినప్పటికీ తప్పుడు కేసు పెట్టారని అన్నారు. టీడీపీ నేత పట్టాభి రెచ్చగొట్టడం వల్లే గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి జరిగిందని, మొదట్లో వంశీ పేరు ఎక్కడా లేదని. దాడి ఘటనలో వంశీ లేరని, అయినా వంశీ పేరును 71వ నిందితుడిగా ఎఫ్ఐఆర్ లో చేర్చారని అన్నారు. ఘటన జరిగినప్పుడు అక్కడి నుంచి వెళ్లిపోయానని సత్యవర్ధన్ చెప్పాడు. సత్యవర్ధన్ ను తీసుకెళ్లి తెల్లకాగితంపై సంతకం చేయించుకున్నారని జగన్ ఆరోపించారు. పట్టాభిని చంద్రబాబే పంపించి గన్నవరంలో దాడి చేయించారని మండిపడ్డారు.

## రాత్రి 7 గంటలకు సంచలన నిజం బయటపెడ్తాం

### వైస్సార్‌సీపీ ట్వీట్ వైరల్!

వల్లభనేని వంశీపై నమోదైన కేసు గురించి సంచలన విషయం వెల్లడించబోతున్నట్లు వైసీపీ ట్వీట్ చేసింది. మంగళవారం రాత్రి 7 గంటలకు గన్నవరం కేసుకు సంబంధించిన నిజాన్ని బయటపెట్టబోతున్నాం. అతిపెద్ద రహస్యం బయటపడనుంది అని ట్వీట్ లో వైస్సార్‌సీపీ రాసుకొచ్చింది. కాగా, గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసు ఫిర్యాదు దారైన సత్య వర్ధన్ ను బెదిరించారని ఆరోపిస్తూ పోలీసులు వంశీని జైలుకు పంపిన సంగతి తెలిసిందే.